క్లుప్తంగా

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మానవపాడు: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. బుధవారం మండలంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ల డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. అనుమతులు పొందిన వారు మాత్రమే ఇసుక తరలించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన బైక్.. ముగ్గురికి గాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై బైక్ టైరు పేలి అదుపుతప్పి కింద పడటంతో ముగ్గురికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల పట్టణానికి చెందిన నాగిరెడ్డి, సురేందర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి బుల్లెట్ బైక్‌పై కర్నూలు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జాతీయ రహదారిపై జింకలపల్లి స్టేజీ సమీపంలో వారి బైక్ ముందు టైరు పేలి బైక్ అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిని వారిని గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బీమా చెక్కు అందజేసిన ఎస్పీ

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళా కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు బీమా చెక్కు అందజేశారు. కేటీదొడ్డి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణి గత సంవత్సరం సెప్టెంబర్‌లో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన బీమా చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి దోచుకెళ్లారు

అలంపూర్: రోడ్డు పక్కన బైక్ ఆపిన వ్యక్తిని కత్తితో బెదిరించి బైక్, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు.. మానవపాడు మండలం కొర్విపాడు స్టేజీకి చెందిన మాదిగ ఫిలేమాన్ ఈనెల 2న అలంపూర్ చౌరస్తా సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బైక్ ఆపి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు స్కూటీపై వచ్చి ఫిలేమాన్‌ను కత్తితో బెదిరించి మొబైల్, రూ.2500 నగదు, బైక్ ఎత్తికెళ్లినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1,47,500 ఉంటుందని పేర్కొన్నారు.

పందుల బెడదతో పంట నష్టం

శాంతినగర్: పందుల బెడదతో పంట నష్టపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ సమీపంలోని పంట పొలాలను పందులు నష్టపరుస్తున్నాయని శాంతినగర్‌కు చెందిన భానుప్రసాద్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. తనకు సంబంధించిన పామాయిల్ తోటను పందులు పాడు చేస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాదాపు రూ.లక్ష వరకు నష్టపోయినట్లు తెలిపాడు. పందుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. పందుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణగ్రహీతలు రెన్యువల్ చేసుకోవాలి

మానవపాడు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్వల్పకాలిక రుణాలు తీసుకున్న రైతులు ఈనెల 15వ తేదీ లోపు రుణాలపై తీసుకున్న వడ్డీ చెల్లించాలని పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణం తీసుకున్న లబ్ధిదారులు రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యం

మల్దకల్: ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని గద్వాల డీఎస్పీ మొగులయ్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. పోలీసు స్టేషనుకు వచ్చే కేసుల పరిష్కారంతో పాటు సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిబద్ధతతో పనిచేసిన వారికి రివార్డులు, అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. సీసీ కెమెరాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. అనంతరం ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని డీఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నందికర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో పల్లెలు

- నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- అత్యాధునిక కెమెరాల ఏర్పాటుతో భద్రతకు భరోసా
- గ్రామస్తులను చైతన్యపరుస్తున్న పోలీసులు



మానవపాడులో సీసీ కెమెరా రికార్డును మానిటరింగ్ చేస్తున్న పోలీసులు(ఫైల్)

మానవపాడు: గ్రామాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు నిఘా పటిష్టం చేశారు. ప్రధానంగా శాంతి భద్రతలు, అసాంఘీక కార్యాకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలోని ఆయా గ్రామాలను నిఘా నేత్రం కిందకు తీసుకొచ్చారు. సీసీ కెమెరాల ద్వారా నమోదైన దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ప్రమాదాలకు కారణమైన వాహనాలను వెంటనే గుర్తించి కేసులు పరిష్కరిస్తున్నారు. చోరీలు, అనుమానిత వ్యక్తుల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

గ్రామస్తుల సహకారంతో

దాదాపుగా మండలంలో 21 కెమెరాలు ఏర్పాటు చేయగా.. మండల కేంద్రంలో -7, మానవపాడు స్టేజీ జాతీయ రహదారి వద్ద- 4, చంద్రశేఖర్‌నగర్ స్టేజిలో-3, కొర్విపాడు గ్రామంలో-4 సీసీ కెమెరాలను రైతు సంఘం, గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో 4-కే కెమెరాలు వ్యాపార సముదాయలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాలు, చౌరస్తాలో ఏర్పాటు చేశారు. రికార్డయిన దృశ్యాలను ఎప్పటికప్పుడు చూసేందుకు పోలీస్‌స్టేషన్‌లో స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రధానంగా దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, చోరీలు, ఈవ్‌టీజింగ్ తదితర సంఘటనలు అరికట్టేందుకు అవకాశం ఉందని అవగాహన కల్పిస్తున్నారు.

'నేను సైతం'లో ప్రజల భాగస్వామ్యం..

మండలంలోని ఆయా గ్రామాల్లో నేనుసైతం కార్యక్రమం ద్వారా ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి, ప్రజలను చైతన్య పరుస్తున్నారు. వాణిజ్య, వ్యాపార, వర్తక సంఘాల ప్రతినిధులతో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కలిపిస్తున్నారు. ప్రతి కెమెరాను ఆయా గ్రామాల్లోని కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు.

నేరాల నియంత్రణకు తోడ్పాటు..



సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు సాధ్యమవుతుందని పోలీసులు పేర్కొన్నారు. భద్రతాపరంగా, రోడ్డు ప్రమాదాల్లో సంఘనలు, చోరీలకు సంబంధించిన ఆధారాలు లభ్యమవుతున్నాయన్నారు. మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరంగా కట్టుదిట్టంగా చేసేందుకు కృషి చేస్తున్నాం.

-చంద్రకాంత్ ఎస్‌ఐ, మానవపాడు



మానవపాడులో జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరా

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



మగ్గాలను పరిశీలిస్తున్న జేడీ వెంకటేశ్వర్‌రావు

రాజోళి: నేతన్న పొదుపు పథకంపై అధికారులు చేస్తున్న సర్వే పకడ్బందీగా నిర్వహించాలని చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీ, కొత్త రాజోళిలోని మగ్గాలను బుధవారం ఆయన పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. నేతన్న పొదుపు పథకం త్వరలోనే ప్రారంభం కానున్నందున అధికారులు చేస్తున్న సర్వేకి సహకరించాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకూడదని అక్రమాలకు తావివ్వకూడదని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏడీలు గోవిందయ్య, చరణ్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ధర్నాలో రైతాంగ సమితి నాయకులు

గద్వాలటౌన్: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. మూడు వ్యవసాయ చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకరావడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. జూరాల ప్రాజెక్టులో పేరుకపోయిన పూడికను తీయాలన్నారు. ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు నీరందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ ప్రభాకర్, నాగన్న, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

9 మంది నిందితులకు జైలుశిక్ష

గద్వాల క్రైం: ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన 9 మంది నిందితులకు నెలరోజుల పాటు జైలు శిక్షను మొదటి అదనపు జడ్జి కళ్యాణ్ చక్రవర్తి విధించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధికారిని పుష్ప 07.11.2017లో విధుల్లో భాగంగా కార్యాలయానికి వచ్చారు. మధ్యాహ్న సమయంలో దాదాపు 30 మంది రైతులు వేరుశనగ పంటకు ధర తక్కువగా వచ్చిందని అధికారితో వాగ్వాదం పెట్టుకున్నారు. ఈ క్రమంలో కార్యాలయ ఫర్నిచర్, బీరువా, కంప్యూటర్ తదితర వస్తువులను ధ్వంసం చేస్తు విధుల్లో ఉన్న అధికారిని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసు స్టేషన్ కేసు నమోదు చేశారు. బుధవారం కోర్టులో పలువురు సాక్షుల వాగ్మూలం అనంతరం జడ్జి 9 మంది నిందితులు పింజరి గోకరి, మహబూబ్, గుడిసే సవరన్న, కుర్వ బీముడు, మైబు, ఖాజా హుస్సేన్, నరేష్, గోవిందు, వెంకటేష్‌లకు నెలరోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

పందుల దొంగతనం కేసులో రిమాండ్

అలంపూర్ రూరల్: పట్టణ సమీపంలోని పాపనాశీశ్వర ఆలయ సమీపంలో రెండు నెలల క్రితం జరిగిన పందుల దొంగతనం కేసులో నిందితులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. ఎమ్మిగనూర్‌కు చెందిన ఎరుకలి భీమన్న, ఎరుకలి బాలరాజు, ఎరుకలి నాగరాజు, ఎరుకలి సతీష్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



మాట్లాడుతున్న యూనిసెఫ్ బృంద సభ్యుడు

మల్దకల్: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, యూనిసెఫ్ సమగ్ర శిక్ష అభియాన్ బృంద సభ్యులు శ్రావ్య, రవికాంత్, కిషోర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలోనే బోధన చేసి వారి సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. విద్యార్థుల మేధాశక్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ఉండవెల్లిలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉండవెల్లి/అయిజ/మల్దకల్/ధరూరు/కేటీదొడ్డి: ఉండవెల్లి మండల కేంద్రం, బైరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బైరాపురంలో ఎంఈఓ రామకృష్ణ, మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు.

✦ అయిజ మండలంలోని పులికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

✦ మల్దకల్ మండలంలోని బిజ్వారం, కుర్తిరావులచెర్వు జెడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

✦ ధరూరు మండల పరిధిలోని రేవులపల్లి, అల్వాలపాడు పాఠశాలల్లో స్వయం పరిపాన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, హెచ్‌ఎం నీలావతి, ఉపాధ్యాయులు శివకుమారి, ప్రవీణ్ కుమార్, శైలజ, ఆంజనేయుల, షభానా, శివకుమార్, నర్సింహులు, సైదన్న తదితరులు పాల్గొన్నారు.

✦ కేటీదొడ్డి మండలంలోని గంగన్‌పల్లి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు నర్సింహులు, వినోద్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించాలి



కేటీదొడ్డి: ర్యాలంపాడు రిజర్వాయర్ 104 ప్యాకెజ్ కెనాల్ నుంచి చివరి ఆయకట్టుకు నీరందించాలని మండల రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కొండాపురం, ఈర్లబండ, పాగుంట, ఇర్కి,చేడు, వెంకటాపురం, గంగన్‌పల్లి, కేటీదొడ్డి రైతులు కలెక్టర్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కెనాల్‌లో కొందరు మోటార్లు పెట్టి అక్రమంగా నీరు వాడుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రాజేష్, అమరేష్, గోవిందు రెడ్డి, తిమ్మారెడ్డి, కృష్ణ, గోపాల్ రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు గూడ్స్ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గట్టు, కేటీదొడ్డి, అయిజ మండలాల నుంచి నిత్యం మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు 10 నుంచి 30కు పైగా గూడ్స్ వాహనాల్లో కూలీలను చేరవేస్తున్నారు. ఒక్కో వాహనంలో 30 నుంచి 50 మంది కూలీలను ఎక్కించుకుని తరలిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రైవేటు గూడ్స్ వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి

గట్టు: కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం ఆనంద్ పెంచికలపాడు సూచించారు. బుధవారం పెంచికలపాడు గ్రామంలో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఆర్ సమగ్ర సేవ కేంద్రాన్ని డీపీఎం ప్రారంభించి మాట్లాడారు. రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవనోపాధి అధికారి వెంకటేశ్వర్లు, హరి, ప్రోగ్రాం సపోర్ట్ అధికారి మునిస్వామి, సీఓ హలీంపాషా, వీడీసీ కమిటీ సభ్యులు విజయమ్మ, ఇందిర, సుజాత, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంపత్‌కుమార్‌ను ఎమ్మెల్సీగా నియమించాలి

అయిజ: ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప కోరారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డెప్ప మాట్లాడుతూ.. సంపత్ కుమార్ 30 ఏళ్లుగా పార్టీకి అనేక సేవలందించారన్నారు. తనదైన శైలిలో పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయన్న, దేవరాజు, శ్రీధర్, నాగిరెడ్డి, మద్దిలేటి, గాల్‌రెడ్డి, లక్ష్మన్న, మహబూబ్ బాషా, ఖాజా మొహముద్దీన్, మైనర్‌బాబు, దేవేంద్ర, బసవరాజు, రవీందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

రాజోళి: మండల కేంద్రంలో భ్రమరాంబ అడివేశ్వరస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రైతు సంబరాల్లో బండలాగుడు పోటీలను బుధవారం ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండలాడుగు పోటీలు రైతు సంబరాల్లో ప్రధాన చూస్తారన్నారు. అంతర్రాష్ట్ర పాలపళ్ల సైజు ఎద్దుల బల ప్రదర్శన సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దుల యజమానులతో ఆయన మాట్లాడారు. పోటీల్లో రామవరానికి చెందిన రామచంద్రారెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. యజమానికి రూ. 50వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన సాతర్లకు చెందిన అర్షద్ బాష ఎద్దుల యజమానికి రూ.40 వేల నగదును సర్వేశ్వర్ రెడ్డి, శ్యాల్ మియ్య, గోవర్ధన్ రెడ్డి, అశోక్ రెడ్డి అందజేశారు. అనంతరం తదితర స్థానాల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనువాసులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, కిరణ్ రెడ్డి, గోపాల్, చంద్రగౌడ్, గోవర్ధన్ రెడ్డి తదిదరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా

అలంపూర్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 400 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడానికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, అందులో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ నాయకులు బండల పాండు, చిత్తారి కిరణ్‌లు బుధవారం కలెక్టర్ సంతోష్‌ను కలిసి కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై వినతి పత్రం అందజేశారు. 34వ వార్డు కుంటవీధిలో ప్రజా అవసరాల కోసం వదిలిన పదిశాతం స్థలంలో కొంతమంది ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా ఇళ్ల పట్టాలు సృష్టించారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక ప్రజా అవసరాల స్థలాన్ని కబ్జా చేసి దౌర్జాన్యంగా భారీ భవంతిని నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోగస్ పట్టాలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. తక్షణమే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో న్యాయం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ భీంసేన్‌రావు గద్వాల మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఐడీఎస్ఎంటీ ప్లాట్లు, దుకాణాలకు వేలం నిర్వహించి మున్సిపాలిటీకి ఆదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న భగత్ రెడ్డి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించడం వలన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థులపై ఒత్తిడి పెంచి ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భీమసేనరావు, లక్ష్మణ్ గౌడ్, లక్ష్మణాచారి, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

మల్దకల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తహసీల్దార్ షాహిదాబేగం, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని పాల్వాయి, మల్దకల్ పాఠశాలలను వారు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. అదే విధంగా వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ముఖ్యంగా బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం..



అలంపూర్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పలు చోట్ల ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు అధికారులు, పోలీసులు పేర్కొన్నారు.

✦ అయిజ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 257 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. అరోరా పరీక్ష కేంద్రంలో 258 మంది హాజరు కావాల్సి ఉండగా 5 మంది గైర్హాజరయ్యారు. శ్రీహరిహర పరీక్ష కేంద్రంలో 221 మంది విద్యార్థులకు గాను 9 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

✦ ఉండవెల్లి మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు అలంపూర్‌లోని కళాశాలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఎలిజిబిత్ సుహాసిని తెలిపారు.

✦ అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 468 మంది విద్యార్థులకు గాను 19 మంది గైర్హాజరు కాగా కాగా 449 మంది పరీక్షలు రాసినట్లు అధికారి హృదయరాజు తెలిపారు.

✦ ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 447 మంది విద్యార్థులకు గాను 341 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎస్‌ఐ శ్రీహరి పర్యవేక్షించారు.


✦ మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్ గోవర్ధన్ శెట్టి, డిపార్ట్‌మెంటల్ అధికారి శ్రీరాములు ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. 94 మంది విద్యార్థులకు గాను 86 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

✦ గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 277 మంది విద్యార్థులకు గాను 271 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ అధికారి కేఎస్‌డీ రాజు, డిపార్టుమెంటల్ అధికారి కాశీ విశ్వనాథ్‌లు తెలిపారు. ఒకేషనల్ పరీక్షకు 60 మందికి 52 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

✦ మానవపాడు మండల కేంద్రంలోని శ్రీగంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 176 మంది విద్యార్థులకు 175 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ రాజేందర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.



గద్వాలలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు



ఉండవెల్లిలో మైనార్టీ గురుకుల విద్యార్థులు